రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే సామేల్

మోత్కూరులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జనవరి 7 : రోడ్డు పనుల పూర్తికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. పట్టణంలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎస్‌బీఐ సమీపంలో ఉత్తర భాగం రోడ్డును 75 మీటర్లు, దక్షిణం భాగం వైపు రోడ్డును 15మీటర్ల వరకు పొడిగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు డివైడర్లకు ఇరువైపులా రంగులతో అలంకరణ చేసి ప్రకృతిపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా బొమ్మలు వేయించాలన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ డీఈ మనోహర్, నాయకులు లక్ష్మీనర్సింహా రెడ్డి, వెంకటేశ్వర్లు, రామచంద్రు ఉన్నారు.

అందరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జనవరి 7 : రోడ్డు భద్రత నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో ట్రినిటీ స్కూల్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. 18ఏండ్లు నిండినవారు మాత్రమే బైక్‌లు నడుపాలన్నారు. నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ ఆనంద్ శ్యాంప్రసాద్, సీఐ మన్మథకుమార్, పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పనులను పూర్తి చేయాలి : రైతు సంఘం

రైతులకు రైతు సంఘం సభ్యత్వాలు అందజేస్తున్న సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి

ఆత్మకూరు(ఎం), జనవరి 7 : బునాదిగాని కాల్వ పనులను పూర్తి చేసి మండలానికి గోదావరి జలాలు అందించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పల్లెర్ల గ్రామంలో మంగళవారం రైతు సంఘం సభ్యత్వ నమోదు చేపట్టి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీనగర్ మండలం మక్తాఅనంతారం నుంచి అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు 91 కిలోమీటర్ల పొడవున సాగే బునాదిగాని కాల్వ పనులను వెంటనే పూర్తి చేసి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో చేతి వృత్తి సంఘాల జిల్లా నాయకులు వేముల భిక్షం, రైతు సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ఎల్లయ్య, గోపాల్, మధుసూదన్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.3వేలు తగ్గించడం అన్యాయం : సీపీఎం

పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

చౌటుప్పల్, జనవరి 7 : రైతుభరోసా ఏటా ఎకరానికి రూ.15వేలు ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రూ.3వేలు తగ్గించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్కసారి కూడా పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. రైతులు పంటల సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని గుర్తుచేశారు. రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు రాగీరు కిష్టయ్య, తడక మోహన్, బాలయ్య, సుదర్శన్, శ్రీశైలం, నందీశ్వర్, మధుకృష్ణ, నరేశ్, జంగయ్య, మహేశ్ పాల్గొన్నారు.

'కేటీఆర్‌పై ఈ-రేస్ కేసు రాజకీయ కుట్ర'

గుండాల, జనవరి 7 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఈ – రేస్ కేసు కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు కొమ్మగళ్ల దయాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల తరపున కేటీఆర్ ప్రశ్నించడాన్ని ప్రభుత్వం తట్టుకోలేక కేసులు పెడుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ఇమేజ్‌ను పెంచాలన్న తపనతో కేటీఆర్ ఐటీ రంగాలను అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరలించడానికే ఇటువంటి కేసులు పెడుతున్నదని ఆరోపించారు.

హమాలీ కార్మికుల ఆందోళన

- కూలి రేట్ల జీఓ విడుదల చేయాలని బియ్యం లారీ అడ్డగింత

రేషన్ బియ్యం తీసుకెళ్తున్న లారీని అడ్డుకొని ధర్నా చేస్తున్న కార్మికులు

భువనగిరి అర్బన్, జనవరి 7 : పెంచిన కూలి రేట్ల జీఓను విడుదల చేయాలని కోరుతూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణంలోని గోదాము నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ హమాలీ కార్మికులు తమ కూలి రేట్ల జీఓను విడుదల చేయాలని సమ్మె చేస్తుంటే సివిల్ సప్లయ్ అధికారులు బీహార్ ప్రైవేట్ కార్మికులతో రేషన్ షాపులకు బియ్యాన్ని పంపించాలని చూడడం సరికాదన్నారు. జీఓ విడుదల చేయకుండా అన్యాయం చేసి, ఇతర ప్రాంతానికి చెందిన కార్మికులతో రేషన్ బియ్యాన్ని సరఫరా చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం రేషన్ బియ్యం తీసుకెళ్తున్న లారీని అడ్డుకోవడంతో పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట జరింది. ఈ విషయం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి వెళ్లగా రెండ్రోజుల్లో జీఓను విడుదల చేస్తామని చెప్పడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ఇమ్రాన్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గణబోయిన వెంకటేశ్, యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బస్వయ్య, జగన్, స్వామి, సత్యనారాయణ, గణేశ్, చంద్రయ్య, పాండరి పాల్గొన్నారు.

11, 17తేదీల్లో టెక్నికల్ కోర్సులకు పరీక్షలు : డీఈఓ

భువనగిరి అర్బన్, జనవరి 7 : జిల్లాలో టెక్నికల్, సర్టిఫికెట్ కోర్సులకు పరీక్షలు ఈ నెల 11, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు పట్టణంలోని బీచ్‌మహల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రాయింగ్‌లో లోయర్ అండ్ హయ్యర్, టైలరింగ్ ఎంబ్రాయిడింగ్‌లో లోయర్ అండ్ హయ్యర్‌లో పరీక్షలు వేర్వేరుగా నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పరీక్షలకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు సంబంధిత ఉపాధ్యాయుడు కె.రాఘురాంరెడ్డి (9912096416)ని సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మోత్కూరు, జనవరి 7 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మోత్కూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-2026 సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. పూర్తి వివరాలకు టీజీ వెబ్‌సైట్‌లో చూడాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

చౌటుప్పల్‌లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌటుప్పల్, జనవరి 7 : పట్టణ కేంద్రం-1తోపాటు మండలంలోని పంతంగి, దామెర అగ్రికల్చర్ ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజుల సతీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ఫీడర్ల లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించుట, విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా ఉదయం 8:30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చందుపట్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లారెడ్డి మృతి

మల్లారెడ్డి (ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, జనవరి 7 : మండలంలోని గౌసినగర్ గ్రామానికి చెందిన చందుపట్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎలిమినేటి మల్లారెడ్డి మంగళవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మృతిచెందారు. రైతు కుటుంబంలో జన్మించిన మల్లారెడ్డి రాజకీయాల్లోకి వచ్చి చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్‌గా సేవలందించారు. ఆయన కుమారుడు అమెరికాలో ఉన్నందున అంత్యక్రియలను ఈ నెల 9న గౌస్‌నగర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లారెడ్డి మృతికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌గౌడ్, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

రైతు భరోసాపై మాట మార్చడం తగదు

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలరాజుగౌడ్

రైతులకు సంఘం సభ్యత్వం అందజేస్తున్న రైతు సంఘం రాష్ట్ర నేత బాలరాజు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 7 : ఎన్నికల సమయంలో రైతు భరోసా ఏటా ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మంత్రివర్గంలో రూ.12 వేలు చెల్లిస్తామని నిర్ణయించడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ అన్నారు. మండలంలోని బస్వాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఓడదాటేదాక ఓడ మల్లయ్య.. ఓడ దాటినంక బోడి మల్లయ్య అన్న చందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం, ఎరువులు, పురుగుమందుల ధరల పెరుగుదల, అప్పుల భారంతో రైతుల ఆత్మహత్యలకు కారణం అవుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిషన్ పంట ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధరల చట్టం చేయాలని సిఫారసు చేశారని తెలిపారు. రైతుల ఆత్మహత్యల నివారణకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు అమలు చేసిందని గుర్తు చేశారు. రైతుల ఓట్లు కొల్లగొట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎకరానికి ఏటా రూ.15వేలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. వానకాలం సీజన్ దాటిపోయినా హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా 2పంటలకు కలిపి ఎకరాకు రూ.15వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. అన్ని పంటలకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాసాల వెంకటేశం, మచ్చ భాస్కర్, పులి లక్ష్మీనర్సయ్య, ఉడుత రామచంద్రయ్య, పెంటయ్య, రాఘవులు, వెంకటేశం, అంజయ్య, రాజమల్లయ్య, బాల నర్సింహ, భిక్షపతి, రాంచందర్, సత్తయ్య, రమేశ్, సత్తయ్య పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి : ప్రభాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న యానాల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, జనవరి 7 : గాంధీజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆ సంస్థ మండల కమిటీ సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీజీ సూచించిన విజ్ఞానాన్ని ప్రజలందరికీ క్షేత్రస్థాయిలో అందించాలన్నారు. పట్టణంలోని గాంధీ పార్కులో ఈ నెల 18న గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, చరకా ప్రదర్శన, బాల గాంధీ వేషధారణలు, యోగా, మల్కం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీబీ కృష్ణారావు, మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని మంజుల, ప్రతినిధులు శ్రీలత, సంశ్య, నీరజ, జయ, పద్మావతి, ఝాన్సీరాణి, మమత, రజిత, ఐలమ్మ, రమాదేవి, అనూష, షామిని, సువర్ణలక్ష్మి, కీర్తన, నవనీత, శారద, భవాని, మంజుల, చందన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు గురుకుల మెటీరియల్ అందజేత

విద్యార్థులకు గురుకుల మెటీరియల్ అందజేస్తున్న విపంచి ఫౌండేషన్ సభ్యులు

రామన్నపేట, జనవరి 7 : మండలంలోని వెల్లంకి ప్రాథమిక పాఠశాలలోని నాలుగో తరగతి విద్యార్థులకు విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గురుకుల మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లె మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విపంచి ఫౌండేషన్ సేవలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడంతోపాటు పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించిన వారు అవుతారని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, సభ్యులు కూరెళ్ల నర్సింహాచారి, లక్ష్మణాచారి, సతీశ్, ఉపాధ్యాయులు సోమిరెడ్డి, భిక్షమయ్య, సువర్ణ, వెంకటయ్య, మాధవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ

ఎల్లమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

అడ్డగూడూరు, జనవరి 7 : మాజీ జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి తల్లి చిప్పలపల్లి ఎల్లమ్మ (70) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మండలంలోని కోటమర్తి గ్రామంలోని వారి నివాసానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంగళవారం వెళ్లి ఎల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌డ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, నాయకులు విష్ణువర్ధన్, యాదగిరి, కిరణ్ ఉన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

భువనగిరి అర్బన్, జనవరి 7 : జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయాల చైర్మన్లు, సెక్రటరీలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాఖా గ్రంథాలయాల్లో ఎలాంటి సమస్యలున్నా త్వరలో పరిష్కరిస్తామన్నారు. పాఠకుల సమస్యలను పరిష్కరించాలని గ్రంథాలయ అధికారులకు సూచించారు.

సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మాణం కోసం పోరాటాన్ని కొనసాగిస్తాం

- అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ నాయకులు

చందుపట్లలో మాట్లాడుతున్న అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ ఎల్లయ్య

భువనగిరి కలెక్టరేట్, జనవరి 7 : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద జాతీయ రహదారిని దాటడానికి వీలుగా అండర్ పాస్ నిర్మాణం చేసేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ సిల్వేరు ఎల్లయ్య, కో కన్వీనర్లు మందడి సిద్ధారెడ్డి, కంచి మల్లయ్య అన్నారు. మండలంలోని చందుపట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని, ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడి వికలాంగులైన వారికి నష్టపరిహారం ఇవ్వాలని ఈ నెల 20న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం జరిగిన నాటి నుంచి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, మరిన్ని ప్రాణాలు పోకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకొని అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అండర్ పాస్ నిర్మాణ సాధన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భువనగిరి రాములు, ఉపాధ్యక్షులుగా ఆర్.భాగ్య, కార్యదర్శిగా వై.జనార్దన్, సహాయ కార్యదర్శిగా లక్ష్మీనర్సయ్య ఎన్నికయ్యారు. రమేశ్, కిష్టయ్య, సుందరమ్మ, యాదగిరి, దానయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి దివీస్ సేవలు అభినందనీయం : ఏఈ

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి విశాల్‌రెడ్డి

చౌటుప్పల్, జనవరి 7 : గ్రామ అభివృద్ధికి దివీస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.లింగోటం గ్రామంలో పరిశ్రమ సహకారంతో రూ.54.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను, రూ.5.36లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి కొంత కాలంగా పరిశ్రమ చేస్తున్న అభివృద్ధిని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, గ్రామ పెద్దలు భద్రయ్య, గంగాధర్‌గౌడ్, మాధవరెడ్డి, ఆనంద్ గౌడ్, కృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.

వెల్లంకి వాసికి జాతీయ స్థాయి ఫొటోగ్రాఫర్ అవార్డు

సంజీవకు అవార్డు అందజేస్తున్న హుస్సేన్‌ఖాన్

రామన్నపేట, జనవరి 7 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ కాట్రేగు సంజీవ జాతీయ స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో ఏపీఐఏఎఫ్ చైర్మన్ హుస్సేన్‌ఖాన్ నేతృత్వంలో ఒడిశాలోని బోండాస్‌లో గిరిజన జాతి సంప్రదాయ వేషధారణ, సంప్రదాయ నృత్యాలు, జీవనశైలికి సంబంధించిన విషయాలపై రెండు రోజులు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంజీవకు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు ప్రదానం చేశారు.

వక్ఫ్‌బోర్డు భూములను రక్షించాలి : బీఆర్ఎస్

భువనగిరి అర్బన్, జనవరి 7 : పట్టణంలో అన్యాక్రాంతం అవుతున్న వక్ఫ్ బోర్డు భూములను రక్షించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పట్టణంలోని సమ్మద్ చౌరస్తా సమీపంలోని అషుర్‌ఖానా (పీర్లకొట్టం)కు చెందిన భూమి మీనానగర్‌లోని సర్వే నంబర్ 963లో ఎకరం 18 గుంటలు ఉందన్నారు. ఈ భూమిని గతంలో కొద్దరు కబ్జా చేసి ఇండ్లు కట్టుకున్నారని తెలిపారు. అందులో ప్రస్తుతం 2వేల గజాలు మాత్రమే మిగిలిందన్నారు. మిగిలిన భూమిని మాజీప్రజాప్రతినిధితో పాటు కొందరు వ్యక్తులు ప్లాట్లుగా చేసి బీబీనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇతరులకు విక్రయించారని తెలిపారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అక్రమంగా ప్లాట్లను విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణకు గురైన భూమిని వక్ఫ్‌బోర్డుకు చెందేలా చూడాలని కోరారు.

PUBLIC NOTICE

The General public/s are hereby informed that my client **"SRI ADURU RAJENDRA PRASAD & OTHERS"**, purchased agriculture land in Survey No. [A] Sy.No. 147ఇ5/1/1 an extent of 0.18-5 gunta, [B]. Sy.No. 165ఊ5/1/1 an extent of 0.16 gunta, [C]. Sy.No.168ఇ4 an extent of 0.09 Guntas, [D]. Sy.No. 171ఇ6 an extent of 0.25 gunta, [E]. Sy.No. 173ఇ4 an extent of 0.005 guntas total an extent is Ac 1-29 Guntas in Nemaragomula Village, Bibi Nagar Mandal, Yadagiri - Bhuvangiri Dist. Telangana, bounded by: Other family land & Road; South: Other family land & Road; East: Other family land & Road; and West: Other family land & Road, under Agreement of Sale from **AMIDALA ANJANEYULU** S/o Late AMIDALA SATHAIAH aged about 43 years, R/o. 1-68/3, Floor 102, Nemaragomula, Bagdayara, Jameelpet, Bibi Nagar Mandal, Yadagiri-Bhuvangiri Dist, Telangana, being absolute owner vide Passbook/ Title deed No. T30060120162. If any person/s or parties are having any objection/ claim/ interest/ dispute in respect of the above said transaction or property, the same may be informed within (7) days from the date of this public notice to the address mentioned below, failing which my client will proceed to register the sale transaction. If any claim thereafter shall stand null & void, at their own risk.

Sd/- **M. MANOJ KUMAR,** Advocate
3-5-1097, 1 st Floor, lane beside HP Petrol Bunk, Opp: Blood Bank, (IPM), Narayanguda, Hyderabad-029.
(M): +91-8074373324,+91-9440833888

గంజాయి రవాణా కేసులో ఒకరికి రిమాండ్

వలిగొండ, జనవరి 7 : ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కకుండా పారిపోయిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన నలుగురిలో ఇద్దరిని రామన్నపేటలో పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో తప్పించుకు తిరిగుతున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకడైన దుర్గాప్రసాద్‌ను మండలంలోని టేకులసోమారం గ్రామంలోని అతని ఇంటి వద్ద మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తప్పించుకున్న తిరిగుతున్న సాయికుమార్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. నిందితులు ముగ్గురు వలిగొండ మండల వాసులు కావడంతో గంజాయి కేసును పోలీసులు సీరియస్ తీసుకొని సరుకు మూలలాపై ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు. గంజాయి రవాణాకు పాల్పడినా, అమ్మకాలు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిలాయిపల్లిలో విషాధచాయలు

- ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు

పిల్లాయిపల్లిలో శ్రీరామ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 7 : మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన పర్వతం శ్రీరామ్ (25) సోమవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్ సమీపంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద పెట్రోల్